క్లుప్తంగా

పాఠశాల సహాయకులకు పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్ల పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలల్లో బోధనేతర సిబ్బందికి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది జేఎల్ పదోన్నతులు కల్పిస్తుండగా పాఠశాల సహాయకులకు మాత్రం 20 సంవత్సరాలుగా జేఎల్ పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నారు. జేఎల్ పదోన్నతులకు అడ్డుగా మారిన 223 జీవోను రద్దు చేసి పాఠశాల సహాయకులకు జేఎల్ పదోన్నతులు కల్పించి వారికి న్యాయం చేయాలని కోరారు.

మతోన్మాద శక్తులకు బీజేపీ అండ

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదశక్తులను పెంచి పోషిస్తోందని ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫరూఖ్ హుసేన్ మండిపడ్డారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆవాజ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించకుండా ద్రోహం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెడుతూ ఆదాని, అంబానీలకు పెట్టుబడుదారులుగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడాలన్నారు. ఆవాజ్ జిల్లా నాయకులు చాన్‌బాషా, షరీఫ్, అన్వర్ బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల పెంపు సరికాదు

కడప రూరల్ : ఇంటి పన్నులను 15 శాతం పెంచడాన్ని ఉపసంహరించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో ఇంపాక్ట్ ఫీజులను రద్దు చేసి ఇంటి పన్నులపై 15 శాతం పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



వీఎన్‌పల్లెలో అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఆదివారం నడివీధి గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. జాతరలో శనివారం రాత్రి దేవర పెద్దలను ఆహ్వానించే కార్యక్రమంతో గంగమ్మ జాతర ప్రారంభమైంది. గంగమ్మ, నల్లనమ్మ, అంకాలమ్మ, బోగాదమ్మ తల్లులకు గ్రామంలోని మహిళలు కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసి చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవ యాదవ్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా ముద్దల పండుగ

పెండ్లిమర్రి : మండలంలోని పెండ్లిమర్రి, వెల్లటూరు, శవాస్కన్‌పల్లె, చెర్లోపల్లె, కొత్తపల్లె, యాదవాపురం, చింతవాండ్లపల్లె తదితర గ్రామాలల్లో ప్రజలు ముద్దల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామదేవతలు గంగమ్మ, అంకాలమ్మలకు భక్తులు పూజలు చేసి ఇళ్ళల్లో చల్లముద్దలు ఏర్పాటు చేసుకుని విందు భోజనాలు అరగించి బంధు మిత్రులతో సంతోషంగా గడుపుకున్నారు. శ్రీనివాసపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మునెయ్య, శ్రీనువాసులురెడ్డి, మల్లారెడ్డి ఏర్పాటు చేసిన విందుకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకెదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు హాజరయ్యారు.

సాహితీ బ్రహ్మోత్సవాలకు గుడిపాడు వాసి

దువ్వూరు : మండల పరిధిలోని గుడిపాడు గ్రామానికి చెందిన టి.కృష్ణమూర్తి యాదవ్ ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ చైర్మన్ కత్తి మండవ ప్రతాప్ ఆహ్వానం పంపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈనెల 9, 10వ తేదీల్లో 48 గంటల పాటు నిర్విరామంగా ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొననున్నట్లు కృష్ణమూర్తి యాదవ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుక

ఖాజీపేట : తిప్పాయపల్లె గ్రామంలో ఆదివారం బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గ్రామ రక్షణ దేవగా గంగమ్మ తల్లి ప్రసిద్ధి. అమ్మవారికి గ్రామంలోని వారు అందరూ కలసి నైవేద్యం అందించారు.

‘పరీక్ష’కు వేళాయె

- పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
- 27 కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు





పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లపై కూర్చొని పరిశీలిస్తున్న అబ్జర్వర్ వెంకట కృష్ణారెడ్డి, ఎంఈఓ

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలకు కడప మండల పరిధిలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. సంబంధిత పరీక్షలకు కడప మండల వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయగా.. 5930 మంది పరీక్ష రాయనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణకు 301 మంది ఇన్విజిలేటర్లను కేటాయించారు. ఒక్కో పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యుడు ఉంటారు. అన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు మంచినీటి, విద్యుత్తు సౌకర్యంతో పాటు మెడికల్ కిట్లను సిద్ధం చేశారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షను అమలు చేయనున్నారు. దీంతో పాటు పరీక్షా కేంద్రాలకు చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ సెంటర్‌ను మూసి వేయాలని ఇదే వరకే అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అరగంట ముందే చేరుకోవాలి

విద్యార్థులు నిర్ణీత సమయానికంటే అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. అన్ని రకాల మౌలిక వసతులను సిద్ధం చేశాం. విద్యార్థులు హాల్‌టికెట్ తప్పనిసరిగా తెచ్చుకోవాలి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

– నారాయణ, ఎంఈఓ, కడప

ఇమామ్, మౌజన్లకు సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న లజనతుల్ ఉలేమాకమిటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఇమామ్‌లు, మౌజన్లకు లజనతుల్ ఉలేమాకమిటీ ప్రతినిధులు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నగరంలోని కాగితాలపెంట కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో సంస్థ వ్యవస్థాపకులు, కార్యదర్శి మౌలాన మహమ్మద్ అలీ రషాది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మౌలాన ఇందాదుల్లా నిజామి మాట్లాడుతూ ఆరేళ్లుగా లజనతుల్ ఉలేమా కమిటీ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ఇమామ్‌లు, మౌజన్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎంఎం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ మహబూబ్‌పీర్ , జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ తాహీర్, స్థానిక ప్రముఖులు సుబాన్‌బాష, మౌలాన బాసిర్ అంబాయి మాట్లాడారు. మౌలాన అబ్దుల్ రెహ్మాన్, ముఫ్తీ మసీవుల్లా, ప్రభుత్వ ఖ్వాజీ సిరాజుద్దీన్ బుఖారి, సంఘ సేవకులు అక్రమ్ పాల్గొన్నారు.

వేతనాలను మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు రెండు మాసాలు పూర్తయినా ఇంకా రాలేదని సీఆర్పీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆదిమూలం శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేసి వేతనాలు పెంచిందని, తమకు మాత్రం వర్తింప చేయలేదని పేర్కొన్నారు. సమగ్రశిక్షలో కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇస్తూ మూడు జీవోలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే ఎంటీఎస్ ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా హాకీ టోర్నమెంట్



సీనియర్ క్రీడాకారుడు లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో మాజీ హాకీ క్రీడాకారుడు దివంగత లక్ష్మీనారాయణ మెమోరియల్ హాకీ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఈ టోర్నమెంట్‌ను ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్ ఎస్.సుభాన్‌బాషా ప్రారంభించారు. తొలుత లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి హాకీ క్రీడకు ఆయన చేసి సేవలను ప్రస్తుతించారు. సీనియర్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని హాకీలో రాణించాలని సూచించారు. అనంతరం హాకీ పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్ అందజేశారు. హాకీ శిక్షకుడు కల్యాణ్, లక్ష్మీనారాయణ మిత్రులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని జర్నలిస్టు కాలనీలో తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతుండేవి. ఈ విషయాన్ని మార్చి 29న ‘తాగునీటి పైపులైన్ లీకేజీ’ పేరుతో ‘సాక్షి’ వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన నగరపాలక అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. లీకేజీని అరికట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

కడప కల్చరల్: కడప నగరం బెల్లంమండివీధిలోని మదరస జహారాలో జమా అతె ఇస్లామి హింద్, కడపశాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజేదార్లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక అని.. అందరూ కలిసిమెలిసి ఉండాలన్నదే ఇందులోని పరమార్థం అన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు మోహిద్దీన్, నగర అధ్యక్షులు రియాజ్‌బాష, ఎంపీజే జిల్లా అధ్యక్షులు రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: నగరంలోని రవి గ్రూప్ థియేటర్స్‌లో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షేక్ అజామ్, కేకేవైజీఎస్ ట్రస్ట్ అధ్యక్షుడు షేక్ మౌలా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమలాపురం శాసన సభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికీ మేలు జరగాలని, అల్లాహ్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే, జెడ్పీటీసీలను సన్మానించారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ అకాడమి ప్రతినిధుల ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

హంసవాహనంపై ఆదిచెన్నకేశవస్వామి



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధి చెన్నంపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన ఆదివారం స్వామి వారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయ కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. అలాగే సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా సోమవారం స్వామి వారికి శేషవాహన సేవ నిర్వహించనున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాకమళ్ళరంగారెడ్డి, సభ్యులు వాకమళ్ళ నారాయణరెడ్డి, దశరథరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి చెన్నకృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు రమేష్‌శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో ఆదివారం రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. స్థానిక ముక్కొండ వద్ద నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్ల కాలనీ వాసులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా రూ.2 కోట్లు అంచనాతో కాలనీ వద్ద సబ్ స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు బండి నాగేంద్రప్రసాద్, ఏవీ సుబ్బారెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కిరణ్మయి, జ్వాలా నరసింహాశర్మ, కౌన్సిలర్లు వెంకటేష్, సుధాకర్, వెంకటసుబ్బన్న, రామదాసు, భరత్‌కుమార్‌రెడ్డి, విద్యుత్ ఈఈ జీవీ రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాముడు, విద్యుత్ ఏడీఈ శ్రీనివాసరెడ్డి, కన్‌స్ట్రక్షన్ విభాగం డీఈఈ నాగరాజు, ఏడీఈ భరణి, ఏఈలు రామభద్రయ్య, రఘు పాల్గొన్నారు.

■ మండలంలోని తువ్వపల్లె కూడలి వద్ద రూ.2 కోట్లు అంచనాతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంఎస్ఆర్, రామశివారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

కడప కల్చరల్ : క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు ఆత్మబలిదానాన్ని తెలిపే గుడ్‌ఫ్రైడే రాకను తెలుపుతూ ఆదివారం కడప నగరంలోని సీఎస్ఐ ప్రధాన చర్చిలో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా గురువుల ఆధ్వర్యంలో విశేష ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బిషప్ గుడ్‌ఫ్రైడే మూడు రోజుల ప్రాధాన్యత, పవిత్రతల గురించి వివరించారు. ప్రార్థనలనంతరం విశ్వాసులు ఈతమట్టలు చేతబూని చర్చి చుట్టూ క్రీస్తు ధ్యానం చేస్తూ ప్రదక్షిణలు నిర్వహించారు.

ఆరోగ్యమాత చర్చిలో..

స్థానిక రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిలో ప్రార్థనలనంతరం విశ్వాసులు మట్టలు చేతబూని ఈదుల రాజా జయహో అంటూ చర్చి ప్రధాన ద్వారం నుంచి ప్రార్థన మందిరం వరకు ఊరేగింపు నిర్వహించారు. చర్చి ప్రముఖులు మాట్లాడుతూ విశ్వాసులంతా దేవునికి అత్యంత చేరువగా ఉండాలని సూచించారు. రానున్న గురువారం కడరాత్రి భోజనం, శిష్యుల పాదాలను కడిగే సంప్రదాయం, ఆరాధన, అనంతరం శుభ శుక్రవారం, క్రీస్తు శ్రమల పాటలు, శిలువలో పలికిన ఏడు మాటలు, పస్క జాగరణలతో క్రీస్తు పునరుత్థానం కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆ క్షేత్రం ప్రముఖులు విశ్వాసులు పాల్గొన్నారు.

కమలాపురం : పట్టణంలోని సీఎస్ఐ, టీసీసీ, తెలుగు మండల సభ, ఆర్‌సీఎం, మన్నా తదితర చర్చిలలో మట్టల ఆదివారంను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో ఫాస్టర్ భరత్ హెరాల్డ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, యువతీ యువకులు, బాల బాలికలు ఖర్జూరపు, ఈత మట్టలు చేతబట్టి పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో భక్తులను ఉద్దేశించి పాస్టర్ మాట్లాడారు. పూర్వం లోక రక్షకుడు ఏసుక్రీస్తు మరణానికి ముందు చివరి పరిశుద్ధ దినాన ఓలీవ కొండ దగ్గర నున్న బేతనియ అనే గ్రామంలోకి ప్రవేశిస్తున్న ఏసుక్రీస్తును అక్కడి ప్రజలు దారి పొడవునా తమ బట్టలను పరుస్తూ కర్జూర మట్టలతో స్వాగతం పలికారని అప్పటి నుంచి ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారంను మట్టల ఆదివారంగా క్రైస్తవులు నిర్వహించు కుంటారని భక్తులకు సందేశం అందించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న డాక్టర్ శివానాయక్

కడప రూరల్ : నిరుపేద గిరిజన వర్గాలు ఉన్నత కుటుంబాలుగా ఎదగడానికి విద్యను ఆయుధంగా మలుచుకోవాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ వై.శివానాయక్ తెలిపారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా కడప నగరంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఆదివారం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్‌ను పంపిణీ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సావిత్రిభాయి, జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటస్వామి నాయక్, బీడీ నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప కల్చరల్: స్థానిక శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శంకరాపురం ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ వేలూరి ప్రభుదాస్, రాయలసీమ మహిళా సంఘం కార్యదర్శి తస్లీమ్, సొసైటీ వ్యవస్థాపకులుప్రసాద్, ఆర్ఎస్‌వైఎఫ్ విద్యార్థి యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నగరంలో శాకాహార శాంతి ర్యాలీ



శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

కడప కల్చరల్ : స్థానిక పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం వద్దగల పిరమిడ్ ధ్యాన కేంద్రం నుంచి విశ్వాత్మ పిరమిడ్ యోగా అండ్ మెడిటేషన్ రీసెర్చి సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ధ్యానులు శాకాహార ర్యాలీ నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు జీవీ శేషారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ర్యాలీ 11 గంటల వరకు కొనసాగింది. కో ఆపరేటివ్ కాలనీ, రాజారెడ్డివీధి తదితర వీధుల్లో ధ్యానులు శాకాహారమే అమృతాహారం అంటూ నినాదాలు చేస్తూ సాగారు. శాకాహారం అవసరాన్ని వివరిస్తూ అహింసో పరమధర్మః అన్న మాట ప్రకారం ప్రతి ప్రాణిలో దేవుడు ఉన్నాడంటూ నినాదాలు చేస్తూ సాగారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్లు జి.రామసుబ్బారెడ్డి, ఎంసీ ఓబయ్య, పి.రమణ, సంజీవి, మురళి, జి.శ్యామల, సరోజ, ప్రసాద్, శర్వాణి, ప్రభాకర్, వెంకట సుబ్బయ్య, బాల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ముదిరాజుల సమస్య

ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : ముదిరాజుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే తాను వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక గ్రామ చావడి వద్ద ముదిరాజుల జిల్లా అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేకి ముదిరాజులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక పెద్దపెద్ద పట్టణాలున్నప్పటికీ ముదిరాజులు తమ ఆత్మీయ సమ్మేళనాన్ని కమలాపురంలో నిర్వహించడం, అందుకు రాష్ట్ర నాయకులు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ముదిరాజులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. అలాగే ముదిరాజుల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ముదిరాజులు గతంలో సముద్రంలో ముత్యాల వేట చేసేవారని, అందుకే వారికి ముదిరాజులు అనే పేరువచ్చిందన్నారు. ముదిరాజులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. ముదిరాజుల వర్గానికి చెందిన విడుదల రజనీకి మంత్రి పదవి ఇచ్చారన్నారు. ముదిరాజ్ యువసేన ఫౌండర్ గూడూరు నాని మాట్లాడుతూ తాము చేపట్టిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 7 లక్షల ముదిరాజ్ కుటుంబాలున్నాయన్నారు. ముదిరాజులను మొదటగా గుర్తించినది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే నన్నారు. ఈ ప్రభుత్వం ముదిరాజుల కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. 2009లో మహానేత వైఎస్సార్ ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చారని, అయితే ఆయన మరణానంతరం కొందరు దీనిపై కోర్టుకు వెళ్లారన్నారు. ప్రస్తుతం ఆ కేసు సుప్రీం కోర్టులో ఉందని, ప్రభుత్వం ఇష్టమైతే ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చుకోవచ్చని, అయితే సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేయాలని తెలిపిందన్నారు. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ముదిరాజుల మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

కమలాపురం : టెన్త్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పరీక్షల ప్రారంభానికి అర గంట ముందే సెంటర్లకు చేరుకోవాలని అధికారులు ఇప్పటికే విద్యార్థులకు సూచనలు జారీ చేశారు.

ఈ ఏడాది నుంచి ఆరు పేపర్లే:

ఈ ఏడాది నుంచి టెన్త్ పరీక్షలు ఆరు పేపర్లకు కుదించారు. గతంలో 7 పేపర్లు ఉండేవి. ఈ ఏడాది నుంచి ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ రెండూ కలిపి ఒకే పేపర్ చేయడంతో ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే పరీక్షల్లో ఆరు పేపర్లు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున ఆరు పేపర్లకు 600 మార్కులు ఉంటాయి. కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 39 ప్రభుత్వ పాఠశాలు, 20 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1512 మంది బాలురు, 1260 మంది బాలికలు మొత్తం 2772 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్లో సోమవారం నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన 304 మంది విద్యార్థులు గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో పరీక్షలకు హాజరు కానున్నారని ఎంఈవో లిల్లెమ్మ తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 96 మంది, గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 47 మంది, వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 51 మంది, పెద్దపుత్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన 34 మంది, వేదాస్ పాఠశాలకు చెందిన 65 మంది విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇందులో 277 మంది విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలోనూ, 27 మంది విద్యార్థులు తెలుగు మీడియంలో పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

BEST OF LUCK
ఆత్మస్థైర్యం మనోబలంతో SSC పరీక్షలు వ్రాయబోతున్న విద్యార్థినీ, విద్యార్థులందరికీ విజయోస్తు...
మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ...
పీస్ ఇస్లామిక్ హై స్కూలు
SBI కాలనీ, కడప. Ph: 9502639212

SYED GHOUSE PEER
Director

BEST OF LUCK
SSC పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు
విజయీ భవ... దిగ్విజయీ భవ...
విష్ణు విద్యామందిర్ హై స్కూలు
బుగ్గలేటిపల్లి, YSR Kadapa (Dt).

SRINIVAS REDDY
Correspondent

BEST OF LUCK
* 10th పరీక్ష వ్రాయుచున్న విద్యార్థిని, విద్యార్థులకు విజయీ భవ...
* Offline & Online Classes are Avai for EAPCET, POLYCET, ICET, INTERMEDIATE & Govt. Jobs
* For Online Classes Download "IQ Academy" App.
IQ ACADEMY
Join to gain Knowledge
Akkayapalli, Kagithalapenta, KADAPA.
Cell : 8555803288, 9154482765

S.Kousar Jahan
Chairman